క్లుప్తంగా

నవరత్నాలతో నిరుపేదలకు ఆర్థిక భరోసా



ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ, తదితరులు

వేపాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించాయని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అన్నారు. మండలంలోని జాకేరు గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగనన్నకు ఆశీర్వాదం అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు, అప్పలనాయుడు, ఎంపీటీసీ టి.వి.రమణ, పార్టీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వేపాడ: మండలంలో రాయుడుపేట గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గాడి ముసలయ్య, గాడి అప్పారావులకు చెందిన గడ్డివాములకు ఉదయం 11 గంటల సమయంలో మంటలు అంటుకోవడం చూసి స్థానికులు ఎస్.కోట అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ అధికారి ఎస్‌కే మదీనా, సిబ్బంది ఆర్.రాము, పీవీ రావు, జె.కామేశ్వరరావు హుటాహుటిన ఘటనా స్థలం వద్దకు చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ ఘటనలో సుమారు రూ.20 వేలు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచానా. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

లక్ష్యాలను అధిగమించాలి..



కార్యదర్శులతో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: ఆస్తిపన్ను వసూళ్లను ముమ్మరం చేసి లక్ష్యాలను అధిగమించాలని కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు ఆదేశించారు. ఈ మేరకు 14, 16, 49 నంబర్ సచివాలయలకు శుక్రవారం చేరుకుని ఆస్తిపన్ను వసూళ్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో అలసత్వం తగదన్నారు.

కొద్దిరోజుల్లో డిజిటల్ గ్రంథాలయాలు



ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు జీను మహేష్‌బాబు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయాలను కొద్దిరోజుల్లో డిజిటల్ గ్రంథాలయాలుగా మార్చుతామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్‌బాబు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణ వీధుల్లో నిర్వహించే అవగాహన ర్యాలీను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సమాచార విప్లవం డిజిటల్ రూపంలో విస్తరిస్తున్నందున ప్రతి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయలో ఉన్నే ఇ-గ్రంథాలయ సాఫ్ట్‌వేర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయ శాఖ సహాయ సంచాలకులు వి.రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. వెండి మంటపంలో ఉన్న సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నాగులచవితి సందడి



వేపాడ: వేపాడలో పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న భక్తులు

వాడవాడలా నాగుల చవితి సందడి నెలకొంది. నాగదేవతలను పూజించేందుకు భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పుట్టల వద్దకు చేరుకున్నారు. పసుపు, కుంకుమ, పూలతో పుట్టను అలంకరించారు. గుడ్లు, పాలు, నువ్వులతో చేసిన ప్రసాదాన్ని పుట్టలో వేసి నాగదేవతలకు మొక్కులు చెల్లించారు. అనంతరం బాణసంచా కాల్చి సందడి చేశారు. దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్దశి నాడు నాగుల చవితిగా జరుపుకోవడం ఆనవాయితీ. పుట్టలో పాటు పోసి నాగదేవతలను పూజించినట్లయితే సకల సౌభాగ్యాలు, సంతాన ప్రాప్తి కలుగుతాయని భక్తుల విశ్వాసం.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: చీపురుపల్లిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న జెడ్పీటీసీ శిరీష దంపతులు



గంట్యాడ: పెదవేమలిలో పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



గుర్ల: గుర్లలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



దత్తిరాజేరు: పాచలవలసలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



గజపతినగరం: బూడిపేటలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, సర్పంచ్ బూడి జ్యోతి దంపతులు



గజపతినగరం: తుమ్మికాపల్లి సమీపంలో పుట్టలో పాలుపోసి మొక్కు చెల్లిస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక దంపతులు



చీపురుపల్లి రూరల్: రామలింగాపురంలో గ్రామస్తులతో కలిసి పుట్ట వద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ దంపతులు

అట్టహాసంగా చవితి సంబరాలు

- ఆకట్టుకున్న బళ్లవేషాలు
- సంబరాలు ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- తరలివచ్చిన భక్తులు



సంబరాలు ప్రారంభించి బళ్లవేషాల ట్రాక్టర్ నడుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీపురుపల్లి: నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చీపురుపల్లిలో అట్టహాసంగా సంబరాలు నిర్వహించారు. ఏటా సంప్రదాయం ప్రకారం నాగులచవితి రోజున చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో గల పిల్లపేటలో సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ సంబరాలను శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణలు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. అనంతరం వారు బళ్లవేషాల ట్రాక్టర్ నడిపి ఉత్సవాలను ముందుకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పిల్లపేట ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బళ్లవేషాలు ఆకట్టుకున్నాయి. పిల్లపేటలో ప్రారంభమైన బళ్లవేషాల ప్రదర్శన కస్పావీధి, గాంధీబొమ్మ జంక్షన్, మెయిన్‌రోడ్, మూడు రోడ్ల జంక్షన్, ఆంజనేయపురం, లావేరురోడ్ తదితర ప్రాంతాల్లో జరిగింది. ఈ సందర్భంగా బళ్లవేషాలు తిలకించేందుకు చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు సువ్వాడ అప్పలనాయుడు, మహంతి ఉమ, గంట్యాడ బుజ్జి, సతివాడ అప్పారావు, గంట్యాడ విష్ణు, ముల్లు పైడిరాజు, సతివాడ ఆదికృష్ణ, లెంక లక్ష్మణ, కొణితల బంగారునాయుడు, రుత్తల సత్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కంచమ్మతల్లి జాతర



మెరకముడిదాం: కంచమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు



వేపాడ: గౌరమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



జామి: ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శన

మెరకముడిదాం: కొండలావేరు సమీపంలో బోడికొండపై వెలసిన కంచమ్మతల్లి జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. ఏటా నాగులచవితి రోజున బోడికొండపై జాతర నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి జాతరకు భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం సమయానికి భక్తుల తాకిడి మరింత పెరిగింది. మహిళలు పసుపు, కుంకుమతో పాటు చీరలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మెరకముడిదాం మండలంతో పాటు చీపురుపల్లి, గరివిడి, దత్తిరాజేరు, తెర్లాం, బాడంగి మండలాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బుదరాయవలస ఎస్సై నవీన్ పడాల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

గౌరమ్మ సంబరం

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో గుత్తివారి గౌరమ్మ కొలువుదీరిన ప్రాంగణంలో శుక్రవారం సంబరం నిర్వహించారు. ఏటా నాగుల చవితిరోజున గౌరమ్మకు సంబరం చేయడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. కార్తీక పౌర్ణమి వరకు నెలరోజుల పాటు నిత్యపూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జామి: మండలంలో కుమరాం గ్రామంలో గౌరమ్మ సంబరాలు శుక్రవారంతో ముగిసాయి. గౌరమ్మ, పార్వతి, పరమేశ్వరలకు భక్తులు 21 రోజులు పాటు విశేష పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవమూర్తులను గ్రామ తిరువీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, బిందెల డ్యాన్స్, నృత్యాలు, విశేష వేషధారణలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ కె.పద్మావతి, ఏఎంసీ డైరెక్టర్ యు.అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి/రూరల్: మండలంలోని గత్సలవలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్స్) పి.హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పుర్రేయవలస వద్ద నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 33కేవీ లైన్ పనులు చేపడుతున్నందున రామలింగాపురం, పుర్రేయవలస, అలజంగి, మెట్టపల్లి, కర్లాం, నిమ్మలవలస, దేవరపాదిలాం, పత్తికాయవలస, పికె.పాలవలస, పెదనడిపల్లి, ఇటకర్లపల్లి, కరకాం, పేరిపి తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అసౌకర్యానికి ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు బడ్జెట్ సమావేశం

బొండపల్లి: మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం వార్షిక బడ్జెట్‌పై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

నేడు కన్వర్జెన్సీ సమావేశం

బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో విధిగా హాజరుకావాలని కోరారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జామి: మండలంలోని భీమసింగిలో యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీఆర్‌కే ఈశ్వరరావు, జి.రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కొత్తలి వెంకటరావు, అధ్యక్షుడిగా వి.వాసుదేవరావు, సహాధ్యక్షులుగా ఐ.వి.రమణ, ఎం.రూపవతి, ప్రధాన కార్యదర్శి ఎం.తాతంనాయుడు, కోశాధికారిగా బి.శ్రీధర్‌లను ఎన్నుకున్నారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు పామోటి సత్యవతి భర్త గోవిందరావు గత నాలుగు నెలలుగా గ్రామానికి సమీపంలోని వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి, అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు గ్రామస్తులు కొంతమంది శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్లలో ఇసుక తరలించి, ఆయన సోదరుడు వెంకటరావు ఇంటి సమీపంలో డంప్ చేసి, విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయంపై స్పందించిన తహసీల్దార్ అజురఫీజాన్ దర్యాప్తు చేయమని, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే సాయం



అగ్నిప్రమాద బాధితులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మండలంలోని మరుపల్లి గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించరు. పూర్తిగా కాలిపోయిన నిత్యావసరాలు, దుస్తులు, ఇతర సామగ్రిని చూసి చలించిపోయారు. వెంటనే తన జేబులో నుంచి రూ.25 వేలు తీసి ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున అందజేశారు. బాధితులకు ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించేందుకు కృషిచేస్తానని అన్నారు. అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవాపురపు మీన, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, వాకాడ రాంబాబు, మురళీరాజు, కేత వీరన్న తదితరులున్నారు.

ఆప్ కన్వీనర్ పరామర్శ

శృంగవరపుకోట: మండలంలో మరుపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పి.ప్రతాప్‌వర్మ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి వెయ్యి రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



గ్రామంలోని వీధికాలువలను పరిశీలిస్తున్న వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి

జామి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సామ్రాజ్యలక్ష్మి అన్నారు. జాగరం గ్రామంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. వీధి కాలువలు, ఇంటి పరిసరాల్లో దోమలు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, పాత టైర్లు, తాగిపడేసిన కొబ్బరిబొండాలు దోమలకు ఆవాసంగా మారుతాయని, కాబట్టి ఇంటి పరిసరాల్లో చెత్త, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని హెల్త్‌వెల్‌నెస్ సెంటరును పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్.అనిల్‌ప్రేమ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



చీపురుపల్లి రూరల్: గరివిడి గ్రంథాలయంలో చిన్నారితో ముచ్చటిస్తున్న గ్రంథాలయ పరిషత్ సభ్యులు

చీపురుపల్లి: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పౌర గ్రంథాలయ ఉపసంచాలకులు రవి కుమార్ అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠకులు, విద్యార్థులు, పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే యువతకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి వి.మోహనరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కవి సమ్మేళనం, కవులు, రచయితలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యులు జె.మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, స్థానిక గ్రంథాలయశాఖాధికారి ఎ.బుచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి రూరల్(గరివిడి): గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే కేంద్రాలని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జె.మహేష్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పౌరగ్రంథాలయ శాఖ ఉపసంచాలకులు రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఆచార్యులతో కలిసి గరివిడి శాఖా గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయ అభివృద్ధికి మరింతగా కృషిచేయాలని లైబ్రేరియన్ ఎం.ఉషారాణికి సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం

గజపతినగరం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు పెరుగుతాయని లైబ్రేరియన్ వై.స్వప్న అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం చిన్నారులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు

- అండర్ 17 బాలికల్లో విన్నర్ ప్రకాశం, రన్నర్ విజయనగరం
- బాలుర విభాగంలో విన్నర్ గుంటూరు, రన్నర్ శ్రీకాకుళం



ప్రకాశం, విజయనగరం జిల్లాల మధ్య హోరాహోరీగా సాగుతున్న బేస్‌బాల్ పోటీ





జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రాష్ట్ర బాలుర, బాలికల జట్లు

పెదకాకాని: క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డెప్యూటీ విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు చెప్పారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభమైన మూడు రోజుల బేస్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. 67వ ఏపీ ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు అండర్ 17 బాలబాలికల విభాగాలలో 13 జిల్లాల నుంచి 500 క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ఆటతీరును ప్రదర్శించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా బాలుర జట్టు విజేతగా నిలవగా రన్నర్‌గా శ్రీకాకుళం జట్టు నిలిచింది. విజయనగరం జట్టు తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. అలాగే, అండర్ 17 బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు విన్నర్ కాగా విజయనగరం జట్టు రన్నర్‌గా నిలిచింది. తృతీయ స్థానాన్ని శ్రీకాకుళం జట్టు దక్కించుకుంది. విజేతలకు పతకాలు బహూకరించడంతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. విన్నర్, రన్నర్ స్థానాల్లో నిలిచిన జట్లకు గోల్డ్‌కప్‌లు అందజేశారు. అనంతరం జాతీయ స్థాయిలో జరిగే బేస్‌బాల్ పోటీలకు అండర్ 17 బాల బాలికల రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పేరం మస్తాన్ రెడ్డి తెలిపారు. విజేతలకు రాష్ట్ర పాఠ్యపుస్తక డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ తాళ్ళ వెంకటేష్ యాదవ్, గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నంబూరు తిరుపతిరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె నాగజ్యోతి, టోర్నమెంట్ పరిశీలకులు హృదయ రాజు, జయరావు, జగదీశ్వర్‌రెడ్డి, ఎస్ వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ మేనేజర్లు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.